వేడుకలకు అనుమతి తప్పనిసరి





గుంతకల్లులో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి , శింగనమల మండలం సి.బండమీదపల్లిలో సూచనలిస్తున్న సీఐ కౌలుట్లయ్య, శింగనమలలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నిర్మలాకుమారి

- వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
- నిర్వాహకులకు పోలీసులు, అధికారుల సూచనలు

వినాయక చవితి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. వాడవాడలా గణపతి విగ్రహాలు కొలువుదీరి విశేష పూజలందుకోనున్నాయి. ఇప్పటి నుంచే తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని ప్రధాన పట్టణాల్లో వినాయక విగ్రహ విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన కళాకారులు భారీ సైజు మట్టి గణపతుల ప్రతిమలను విక్రయానికి అత్యధిక సంఖ్యలో తయారు చేస్తున్నారు. విగ్రహం సైజును బట్టి రూ.వంద నుంచి రూ.20 వేల దాకా ధరలు ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. విగ్రహాల కొనుగోలుకు ఉత్సవ నిర్వాహకులు పరిశీలిస్తూ అడ్వాన్సులు చెల్లించి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు.

గుంతకల్లు: వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో గణేష్ ఉత్సవాలపై డివిజనల్ లెవల్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీఓ అధ్యక్షత వహించగా గుంతకల్లు డీఎస్పీతోపాటు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ట్రాన్స్‌కో, ఆర్ అండ్‌బీ, హెచ్‌ఎస్‌ఎస్‌ఎస్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, దేవదాయ, అగ్నిమాపక, వినాయక ఉత్సవ కమిటీ నాయకులు తదితర విభాగాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవిత సందర్భంగా బహిరంగ ప్రదేశాలలో పందిర్లు, మండపాలకు నిర్వాహకులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా లేదా మీ పరిధిలో వచ్చే పోలీసుస్టేషన్లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 7వ తేదీ చుతుర్థశి పండగ, 9వ తేదీ గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కృత్రిమ రంగలు, ప్లాస్టర్ అఫ్ పారిస్, జిప్సం మెగ్నీషియం వంటి హానికర రసాయనాలతో తయారు చేసి విగ్రహాలను వాడుకుండా మట్టితో చేసిన విగ్రహాలను ప్రతిష్టించాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగం నిషేధమన్నారు. అనంతరం మార్కెట్ యార్డు సమీపంలోని నిమజ్జన ప్రాంతాన్ని ఆర్డీఓ, డీఎస్పీ తదితరులు పరిశీలించారు. నిమజ్జనం చేసేటప్పుడు నీటి ప్రవాహం వద్ద జాగ్రత్తలు పాటించాలని, ఈ మేరకు నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోండి

శింగనమల: వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడకుండా, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ కౌలుట్లయ్య సూచించారు. మంగళవారం మండలంలోని సి.బండమీదపల్లిలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. గ్రామంలో రౌడీ షీటర్ల, గ్రామస్తులతో మాట్లాడారు. చిన్న చిన్న ఘటనలు జరిగితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. వినాయక చవితి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగినా, ఘర్షణలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నార్పల, గార్లదిన్నె ఎస్‌ఐలు సాగర్, గౌస్, ఎఎస్‌ఐ చితంబరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: వినాయక చవితి ఉత్సవాలు గ్రామాల్లో ప్రశాంతంగా జరుపుకోవాలని శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య సూచించారు. మంగళవారం మండలంలోని మర్తాడులో వినాయక చవితి ఉత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చవితి ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరిగితే కమిటీ సభ్యులు బాధ్యత వహించాల న్నారు. మూడు రోజుల తర్వాత వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి తీసుకోవాలి

శింగనమల: వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని ఎంపీడీఓ నిర్మలా కుమారి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినాయక చవితిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వినాయకచవితి సందర్భంగా మండపాలకు వేసే విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా , శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పండుగను జరుపుకోవాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ గిరి మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ఘర్షణలకు పాల్పబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావు, ఈఓఆర్‌డీ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించొద్దు

తాడిపత్రి అర్బన్: వినాయక విగ్రహాలను తాడిపత్రిలోకి తీసుకొచ్చే క్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలలని అర్బన్ సీఐ సాయిప్రసాద్ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉదయం 8 గంటల లోపు రాత్రి 8.30 గంటల తర్వాత విగ్రహాలను పట్టణంలోకి తీసుకొస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందన్నారు. నిమజ్జనం రోజు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించకుండా సహకరించాలని ఆయన కోరారు.

మట్టి వినాయకులనే ప్రతిష్టించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న కమిషనర్ జబ్బార్ మియా

గుత్తి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే ప్రతిష్టించాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ప్రజలకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మట్టి వినాయకుల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాలతో రూపొందించిన వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా మట్టి వినాయకులనే ఏర్పాటు చేయాలని సూచించారు.

క్లుప్తంగా

మానవత్వం చాటిన కారు డ్రైవర్



రక్తదానం చేస్తున్న కారుడ్రైవర్ పరుశురాముడు

గుంతకల్లుటౌన్: గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చీరాలకు చెందిన కస్తూరి అనే గర్భిణికి అవసరమైన అరుదైన ఓ–నెగిటివ్ (బాంబే బ్లడ్ గ్రూప్) రక్తాన్ని దానం చేసి మానవత్వాన్ని చాటాడు గుంతకల్లు బ్యాంక్‌కాలనీకి చెందిన కారుడ్రైవర్ పరుశురాముడు. వివరాలు.. అరుదైన బాంబే బ్లడ్‌గ్రూప్ కలిగిన గర్భిణికి రక్తం ఎక్కించాలని గుంటూరులోని ఆస్పత్రిలో వైద్యులు సూచించడంతో ఆమె బంధువులు చుట్టుపక్కల ఆరాతీశారు. అయినా ఫలితం లేకపోయింది. ఫేస్‌బుక్ ద్వారా గుంతకల్లు ప్రాణదాత సేవాసమితి సభ్యుడైన పరుశురాముడిని సంప్రదించడంతో అతడు స్వచ్ఛందంగా రక్తదానం చేశాడు. మంగళవారం స్థానిక గోపి బ్లడ్ బ్యాంక్‌లో పరుశురాముడు బ్లడ్‌ప్యాకెట్‌ను గుంటూరు నుంచి వచ్చిన కస్తూరి సోదరుడు లక్ష్మీనారాయణకు అందజేశారు. దీంతో రక్తదాతకు ఆమె కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గేట్స్‌లో 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ఎంపిక



ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

గుత్తి: గుత్తి శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ –2024 ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యాకథాన్ ఆర్ అండ్ డి కోర్డినేటర్ డాక్టర్ ఖయ్యూం ఎంపిక కార్యక్రమం గురించి వివరించారు. హ్యాకథాన్ ప్రధాన ఉద్దేశం మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలకు సంబంధించిన ఒక అతి పెద్ద వేదికన్నారు. ఇందులో ఇంజినీరింగ్ విద్యార్థుల ఆలోచనలు, పునరుత్పాదక శక్తి, అగ్రికల్చర్, స్మార్ట్ వెహికల్స్, క్లీన్ అండ్ గ్రీన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీలకు సంబంధియినవి ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం విద్యార్థులు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 25 టీమ్‌లను హ్యాకథాన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటీఎస్ రైతులకు రుణాలివ్వాలి



కల్లూరు స్టేట్ బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు భారతీయ స్టేట్ బ్యాంకులో రుణాలు ఓటీఎస్ చేసుకున్న రైతులందరికీ మళ్లీ రుణాలు అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కల్లూరులోని స్టేట్ బ్యాంకు ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సమస్యలపై ఆందోళన చేశారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ రైతులకు పశువుల కొనుగోలుకు రూ.25,000 రుణం మంజూరు చేయాలన్నారు. అలాగే క్రాప్ లోన్లు వెంటనే ఇవ్వాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు. జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ,మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నల్లప్ప, సంగప్ప, జయరాముడు, ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో యాడికివాసి ఆత్మహత్య



మృతిచెందిన వెంకటేష్

కర్నూలు: యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన మేడసారి వెంకటేష్ (23) కర్నూలులో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన ఏడాది క్రితం కర్నూలుకు వచ్చి దేవనగర్‌లోని ఎంఎస్9 లాడ్జి వెనుక గదిని అద్దెకు తీసుకుని ఆర్‌ఆర్‌బీ రిక్రూట్‌మెంట్ కోసం చదువుకుంటూ ఉండేవాడు. అలాగే వాహనాలకు జీపీఎస్ సిస్టం బిగిస్తూ జీవనం సాగించేవాడు. ఈనెల 2న తల్లిదండ్రులు ఫోన్ చేస్తే ఆయన లిఫ్ట్ చేయకపోవడంతో.. వారికి అనుమానం వచ్చి కర్నూలులో ఉన్న మృతుడి చిన్నమ్మ కుమారుడు ప్రవీణ్‌కుమార్‌కు ఫోన్ చేసి గది వద్దకు వెళ్లి చూసి రమ్మని చెప్పారు. ప్రవీణ్, అతని స్నేహితుడు బాలరాజుతో కలసి గది వద్దకు వెళ్లి చూడగా తలుపులు మూసి ఉండటంతో బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి తిరుపాలు కర్నూలుకు చేరుకుని మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహానికి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

పొగాకు వాడకంతో అనర్థాలు



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్‌నాయక్

శింగనమల: పొగాకు వల్ల పలువురు క్యాన్సర్ బారిన పడుతున్నారని తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని తరిమెల పీహెచ్‌సీలో ఆశా డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైరిస్కు గర్భిణులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వైద్య సేవలందించాలన్నారు. పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం అందించాలన్నారు. మలేరియా, డెంగీ , వైరల్ ఫీవర్స్ ప్రబలకుండా ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. లెప్రసీ, టీబీ వ్యాధులకు చికిత్స అందించాలని సూచించారు. ఈ నెల 17వ తేదిన నులిపురుగుల నివారణకు 2 – 19 ఏళ్ల పిల్లలకు ఆల్‌బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్. తేజశ్వని, సీహెచ్‌ఓ గంగాధర్, బాలఓబులు, విజయలక్ష్మి, ఆశ్వర్థ, నాగమ్మ, నారాయణ, హెల్త్ ప్రొవైడర్లు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: ఇంజనీరింగ్ విద్యార్థులు చదువులతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) విద్యార్థులలో వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో బిజినెస్ ఐడియా పోటీను నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి చైత్ర, బృందం క్లీన్ అండ్ గ్రీన్ టెక్నాలజీ కింద రూ.4 వేలు అందుకున్నారు. ద్వితీయ బహుమతి అయేషా, సిద్దికా బృందం రూ.3 వేలు అందుకున్నారన్నారు. తృతీయ బహుమతి వర్ధన్‌రెడ్డి, బృందం రెన్యువబుల్ ఎనర్జీ థీం కింద రూ.2 వేలు అందుకున్నారు. నాలుగో బహుమతి ఫణి చంద్, టీం ప్లాస్టిక్ రీసైక్లింక్ కింద రూ.వెయ్యి అందుకున్నారు. కార్యక్రమంలో టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యూసీ కన్వీనర్ డాక్టర్ ఆంజనేయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

గుంతకల్లు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ అధికారం కోసం అనేక వాగ్దానాలు చేసిన కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు వాటిని అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. ఆహారభద్రత చట్టం పకడ్బందీ అమలు, ధరల స్థిరీకరణ నిధి, పంటలకు గిట్టుబాటు ధర వంటి ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి

యాడికి: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండు చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యా లయం ఎదుట మండల సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు వెంకటరాముడు యాదవ్, రైతు సంఘం సీనియర్ నాయకులు శ్రీరాములు, ఓబిరెడ్డి మాట్లాడుతూ వెంటనే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ఐ ఆనందబాబు ఆచారికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డే రాముడు, బందారు రాఘవ, చిన్న కుళ్లాయి రెడ్డి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని సర్ సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఆ విద్యాసంస్థల ఛైర్మన్ బీవీ భాస్కర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు బాట వేస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ ఇందూధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని ఆశయాలను సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి.

సమస్యలు పరిష్కరించాలి

బుక్కరాయసముద్రం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ సరఫరా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట 13వ రోజు సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జీతాలు మంజూరు చేసేంత వరకూ ఆందోళన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాఘవేంద్రాచారి, దేవదాస్, కిష్టప్ప, లక్ష్మిన్న, నాగరాజు పెద్దన్న, నల్లప్ప, విశ్వరూప, నరేష్, విశ్వనాథ్ వలి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

యాడికి: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. వేములపాడులో కొంత కాలంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు మంగళవారం సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించి లక్ష్మయ్య కుమారుడు ఎం. రామచంద్రను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి నుంచి 58 మాజిక్ విస్కీ (90 ఎంఎల్) ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వృద్ధుడికి గాయాలు

పామిడి: పట్టణ వై జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు గాయపడ్డాడు. వివరాలు స్థానిక పామిడమ్మవీధికి చెందిన వృద్ధుడు బోయ ఓబుళప్ప వై జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా అనంతపురం వైపు వేగంగా వెళ్తున్న లారీ ఢీ కొంది. ఘటనలో ఓబుళప్ప తల, కాళ్లు, చేతులకు రక్త గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం బంధువులు అతడిని అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోండి

పామిడి: రిజర్వ్ బ్యాంకు 90 వసంతోత్సవాల పూర్తిని పురష్కరించుకుని నిర్వహిస్తున్న క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు మురళీమోహన్, పవన్‌కుమార్, సుబ్రమణ్యం నాయక్ కోరారు. మంగళవారం స్థానిక ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఆర్‌బీఐ సౌజన్యంతో ఏర్పాటు చేసిన బ్యాంకు క్విజ్ పోటీల అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయి పోటీలకు ఈనెల 17లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 19న రాష్ట్ర స్థాయి, 20న జోనల్ స్థాయి, 21న జాతీయస్థాయిలో ఆన్‌లైన్ పోటీ పరీక్షలు ఉంటాయన్నారు, జాతీయస్థాయిలో 1,2,3 బహుమతులు వరుసగా రూ.10 లక్షలు, రూ.8 లక్షలు, రూ.6 లక్షలు అందజేస్తారన్నారు. ఈ పోటీ పరీక్షల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటాలన్నారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, ఉపన్యాసకుడు పరమేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాటకు వెళ్లి.. వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతి చెందిన రాముడు

ప్రొద్దుటూరు క్రైం: పేకాట ఆడేందుకు వచ్చి కంబగిరి రాముడు (38) ప్రొద్దుటూరులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. యాడికి గ్రామానికి చెందిన కొత్తూరు కంబగిరి రాముడు మరో వ్యక్తితో కలిసి కారులో మంగళవారం ప్రొద్దుటూరు సమీపంలోని కల్లూరు గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో కల్లూరు సమీపంలోని పెన్నానది ఒడ్డున రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలో అతను చనిపోయి ఉన్నాడు. మంగళవారం సాయంత్రం ఈ విషయం తెలియడంతో రూరల్ సీఐ మద్దిలేటి, ఎస్ఐ మహ్మద్‌రఫి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అతని శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. అతని వెంట వచ్చిన మరో వ్యక్తి ఇచ్చిన సమాచారం ఆధారంగా కంబగిరి రాముడు పేకాడేందుకు ఇక్కడికి వచ్చినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఎవరైనా వెంట పడటంతో పరుగెత్తే సమయంలో గుండెపోటు వచ్చి మృతి చెందాడా? లేక పేకాట విషయమై ఏదైనా ఘర్షణ జరిగి మృతి చెందాడా? అనేది తెలియాల్సి ఉంది. డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలంలో పరిశీలించారు. అతడికి భార్యా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న ఆర్డీఓ

గుంతకల్లు రూరల్: గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న ఆర్డీఓకు ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ఆర్డీఓ కుటుంబ సభ్యుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అనంతరం ఆయనకు స్వామి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి

గుంతకల్లు రూరల్: ఫర్టిలైజర్ షాపుల్లో ధరల పట్టిక, స్టాకు వివరాలతో కూడిన బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి సూచించారు. మంగళవారం ఆమె పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అనుమతులు లేని మందులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ప్రత్యామ్నాయ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

పామిడి: ఖరీఫ్–2024 సీజన్‌లో ఇంతవరకూ పంటలు సాగుచేయని రైతన్నల కోసం రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ఇవ్వనున్నట్లు ఏఓ డీ లీనా వసుంధర మంగళవారం తెలిపారు. 10 కిలోల టీ/ఎల్ రకానికి చెందిన రూ.8,700 విలువ చేసే ఉలువలు 80 శాతం సబ్సిడీ పోనూ రైతులకు రూ.1740కు పంపిణీ చేస్తామన్నారు. అలాగే 2 కిలోల సీఐఏ–3156 తో పాటు వివిధ వెరైటీ టీ/ఎల్ రకం రూ.8,740 విలువ చేసే కొర్రలు 80 శాతం సబ్సిడీ పోనూ రూ.1748కే అందజేస్తామన్నారు. మూడు కిలోల మై సీడ్స్ రకంకు చెందిన రూ.700 విలువ చేసే జొన్న ప్యాకెట్ 80 శాతం సబ్సిడీ పోనూ రూ.140కి పంపిణీ చేస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు సమీపంలోని రైతు సేవా సిబ్బందిని సంప్రదించాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లు అందజేసి బయోమెట్రిక్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఏపీటీఎఫ్- 1938 మహాసభలపై ముమ్మర ప్రచారం

పామిడి: పట్టణంలో మంగళవారం రాత్రి ఏపీటీఎఫ్–1938 రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కే కులశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ సంఘం విద్యా–వైజ్ఞానిక మహాసభలపై సంఘం అధ్యాపక బృందం ముమ్మర ప్రచారం చేశారు. కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీటీఎఫ్(1938) 80 వసంతోత్సవాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయనగరంలో ఈ నెల 6,7,8 తేదీల్లో మహాసభలు ఉంటాయన్నారు. సభల్లో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తీర్మానాల రూపంలో సూచనలిస్తాన్నారు. అందులో భాగంగా వారు స్థానిక టీచర్ల ఇంటికి వెళ్లి మహాసభల ప్రతులను అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం శ్రేణులు అనంతయ్య, శంకరయ్య, రామ్మోహన్, సూర్యనాగిరెడ్డి, నారాయణస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

యల్లనూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు లోకేష్ సూచించారు. మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అలాగే విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హాజీవలి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి జగనన్న కాలనీకి రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు కాలనీ వాసులు, కౌన్సిలర్లు విన్నవించారు. జగనన్న కాలనీవాసులు గద్దల నాగేంద్ర, శేఖర్, రవి కుమార్, కౌన్సిలర్లు వరదరాజులు, నరేష్ తదితరులు మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాను కలిసి జగనన్న కాలనీకి రోడ్డు సదుపాయం కల్పించాలని వినతి పత్రం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

కుష్టు వ్యాధిపై సర్వే చేపట్టండి

యల్లనూరు: పల్లెల్లో కుష్టు వ్యాధిపై సర్వే చేపట్టి ఇంటింటా అవగాహన కల్పించాలని డీపీఎంఓ రామచంద్ర సూచించారు. తిమ్మంపల్లి పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం తిమ్మంపల్లి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలు ఉంటే వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి వెళ్లి చికిత్సలు చేయించుకోవాలన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఆశా, ఏఎస్‌ఎం, ఇద్దరు కలిసి లెప్రసీ సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాము, యంఎల్ హెచ్‌పీ భాను, ఏఎస్‌ఎం జాస్మిన్ బేగం, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్‌కు విరాళం

తాడిపత్రి అర్బన్: ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్‌కు పశుసంవర్ధక శాఖ సహాయకుడు నల్లపురెడ్డి రూ.10వేలను మంగళవారం స్థానిక అసోసియేషన్ భవన్‌లో అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

5న ఉపాధ్యాయ దినోత్సవం

తాడిపత్రి అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఈనెల 5న ఎప్పటిలాగే ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో కాకుండా రమణ మహర్షి ఆశ్రమంలో నిర్వహించనున్నట్లు పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పెన్షనర్లకు ఆశ్రమ నిర్వాహకుడు వివి.బ్రహ్మం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు.

డ్రైనేజీల్లో పూడిక తీయండి

గుంతకల్లుటౌన్: డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తీసివేయించి మురుగు పారేటట్టు చూడాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య శానిటరీ మేస్త్రీలకు సూచించారు. మంగళవారం ఉదయం ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ రోడ్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్తాచెదారం డ్రైనేజీల్లో వేయకుండా దుకాణదారులు, ప్రజలకు తెలియజేయాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు.

అగ్గి తెగులు నివారించుకోవాలి

పెద్దవడుగూరు: కొర్ర పంట సాగు చేసిన రైతులు అగ్గి తెగులు నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏఓ మల్లీశ్వరి సూచించారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వర్షాలు అధికంగా రావడం వల్ల తేమ శాతం పెరిగిందన్నారు. దీంతో కొర్రకు అగ్గి తెగులు వ్యాపిస్తోందన్నారు. నివారణకు ఐసోప్రోథోమెలిన్ 300 ఎం.ఎల్. ఒక లీటరు నీటికి కలిపి రైతులు పిచికారీ చేయాలన్నారు. అలాగే మెగ్నీషియం సల్ఫేట్ ఎకరానికి 25 కిలోలు చల్లుకోవాలన్నారు.

భగవద్గీత శ్లోకాలపై పోటీలు

గుత్తి: పట్టణంలోని ఫోర్ట్ రోడ్డులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ మందిరంలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. 10వ తరగతి లోపు విద్యార్థులు, చిన్నారులు భగవద్గీత శ్లోకాల పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన చిన్నారులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.